# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశంలో నదుల అనుసంధానం అవసరమని, జాతీయ ప్రాజెక్టుగా గోదావరి-కావేరి నదులను అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని కోరారు.
- ❖ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలతో ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- ❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 30వ తేదీన విశాఖపట్నంలో పర్యటించనున్నారు.
- ❖ రానున్న రెండు రోజుల పాటు ఉత్తర కోస్తాంధ్ర, రాయలసీమలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================

నీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని.. వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చంద్రబాబు నాయుడు తెలిపారు. కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఈరోజు జరిగింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కర్ణాటక ముఖ్యమంత్రి డీ కే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి ప్రాజెక్టు 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో 51 కోట్ల రూపాయలతో 33 కొత్త గేట్లను అమర్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... నీటి ప్రాజెక్టులు బాగుంటేనే భవిష్యత్ తరాలకు భరోసా ఉంటుందన్నారు. దేశంలో నదుల అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని.. గంగా, కావేరి నదులను అనుసంధానం చేస్తే భారత్‌లో జల వనరుల కొరత తగ్గుతుందని పేర్కొన్నారు. జాతీయ ప్రాజెక్టుగా గోదావరి-కావేరిని కేంద్రం అనుసంధానం చేయాలని చంద్రబాబు నాయుడు కోరుతూ...

(వాయిస్ 29 సెకన్లు)

====================

మాదకద్రవ్యాల వ్యసనం కేవలం సామాజిక సమస్య మాత్రమే కాకుండా దేశ భవిష్యత్‌కు తీవ్రమైన ముప్పని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలో ఈగల్ (EAGLE – Elite Anti-Narcotics Group for Law Enforcement) ఆధ్వర్యంలో "మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ, యువత సాధికారత" అనే అంశంపై ఒక అవగాహన కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనిత మాట్లాడుతూ... మాదకద్రవ్యాల వ్యసనం యువతలోని ప్రతిభ, ఆరోగ్యం, ఆశయాలను నాశనం చేస్తుందని పేర్కొన్నారు. నేర ముఠాలు యువతను లక్ష్యంగా చేసుకుని వారి జీవితాలను మాత్రమే కాకుండా దేశ భద్రత, అభివృద్ధిని కూడా దెబ్బతీస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

====================

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పర్యాటక, సినిమాటోగ్రఫి శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధి బృందం మంత్రి దుర్గేష్ ను ఈరోజు కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ప్రగతిశీల కార్యక్రమాలను ఏపీ ఛాంబర్స్ ప్రతినిధులు కొనియాడారు. ముఖ్యంగా ఏపీ పర్యాటక విధానం 2024-29, పర్యాటక భూమి కేటాయింపు విధానం, బీచ్ షాక్ విధానం, 'హాలిడే ఇన్ ఏపీ / విజిట్ ఏపీ' గ్లోబల్ ప్రచారం తదితర నిర్ణయాలు పర్యాటక రంగ పెట్టుబడిదారులలో నమ్మకాన్ని మరింత రెట్టింపు చేశాయని ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ... త్వరలోనే రాష్ట్రంలో టూర్ ఆపరేటర్లు, ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

====================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 30వ తేదీన విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న కేంద్ర గిరిజన విశ్వ విద్యాలయం తొలి స్నాతకోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం, యూనివర్సిటీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్.. రాష్ట్రపతి కార్యాలయం నిర్దేశించిన ప్రోటోకాల్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు.

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు రేపు సాయంత్రం వరకు పంపించవచ్చు.

విరామం

====================

ధర్మవరం పట్టణం, మున్సిపాలిటీ పరిధిలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి AMRUT 2.0 పథకం కింద 36 కోట్ల 21 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి సరఫరా అభివృద్ధి పనులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మవరం పట్టణంలో తాగునీటి సమస్య దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని తెలిపారు. నీటి సరఫరా సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం AMRUT 2.0 పథకం కింద సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.

=====================

విజయనగరం శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈరోజు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠా కార్యక్రమాన్ని గోవా గవర్నర్, ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమ్మవారి ఆలయ విస్తరణ పనులు ఆరు నెలల్లో పూర్తి అయినందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అమ్మవారి కృప అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. మంచిని ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, స్థానిక ఎంఎల్ఏ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, పూసపాటి వంశీయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

=====================

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో `2 ఏళ్ల పాలన & ఎస్ఐఆర్` అంశాలపై నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ.. ముఖ్యంగా గిరిజన సంక్షేమం, మహిళా శిశు సంక్షేమ శాఖల ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి విశేష పురోగతి సాధించామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై మంత్రి మాట్లాడుతూ... అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

=====================

ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పల్స్ పోలియో నిర్వహణపై ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈరోజు పల్స్ పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈనెల 28న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

=====================

ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామంలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... రైతు కుటుంబాల ఆర్థికాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా పండ్ల తోటల సాగు చేయడానికి ప్రభుత్వం విస్తృత సహాయం అందిస్తోందన్నారు. పండ్ల తోటల సాగు ద్వారా దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చన్నారు. ఈ పథకం ద్వారా మామిడి, కొబ్బరి, జామ, నిమ్మ, దానిమ్మ, మునగ, సీతాఫలం, సపోటా, నేరేడు, గులాబీ పంటలతో పాటు డ్రాగన్ ఫ్రూట్ సాగుకు కూడా ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

=====================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశలుగా గాలులు బలంగా వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు ఉత్తర కోస్తాంధ్ర, రాయలసీమలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములు, మెరుపులు సంభవించవచ్చని, వర్షం కురిసే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం వుందన్నారు.

=====================

=====================